# ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి కథలకు ఆహ్వానం

**కరపత్రాలను ఆవిష్కరించిన సంగమం సాహితీ సాంస్కృతిక కన్వీనర్ డా.చల్లా రవికుమార్**

**ఆలమూరు, పెన్ పవర్,ఆగస్టు 08;** తెలుగు సాహిత్యంలో కథలకు ప్రత్యేక స్థానం ఉందని, మంచి కథలతో సమాజంలో మంచి మార్పులను తీసుకురావచ్చని సంగమం సాహితీ సాంస్కృతిక సంస్థ కన్వీనర్ డా. చల్లా రవికుమార్ అన్నారు. శుక్రవారం శ్రీమతి అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ(రి) ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి కథల పోటీలకు సంబంధించిన కరపత్రాలను మండపేటలో ఆయన ఆవిష్కరించారు. ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కుటుంబ విలువలు అనే అంశంపై కథలను ఆహ్వానిస్తున్నట్లు శ్రీమతి అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ(రి) వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణశ్రీ అన్నారు. పూర్తి వివరాలకు 9963163136 నంబరులో సంప్రదించాలన్నారు. ఆగస్టు 15 లోగా హామీ పత్రంతో కూడిన



కథలను పంపాలన్నారు. కార్యక్రమంలో సంగమం సాహితీ సాంస్కృతిక కన్వీనర్ డా. చల్లా రవికుమార్, డా. మెహెర్ ప్రసన్న, రచయితలు కృష్ణశ్రీ, గొడవర్తి శ్రీనివాసు పాల్గొన్నారు.




# ప్రతి అర్జీకి పరిష్కారం చూపడమే లక్ష్యం



**: మంత్రి వాసంశెట్టి సుభాష్**

**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 8:** ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. శనివారం రామచంద్ర పురంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు,పింఛన్లు, రోడ్ల నిర్మాణం, తాగునీరు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి అవకాశాలు తదితర సమస్యలపై మొత్తం 34 అర్జీలు అందాయి. ప్రతి అర్జీని పరిశీలించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై తమ సమస్యలను పరిష్కరించుకునేలా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పారదర్శకత,జవాబుదారీతనం, ప్రజాసేవకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని పరిష్కారం అయ్యే వరకు పర్యవేక్షిస్తూ, అర్హులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల వద్దకే పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ,రూరల్ మండల అధ్యక్షులు,కాజులూరు మండల అధ్యక్షులు చవ్వాకుల నారాయణ మూర్తి, కూటమి నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

# జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో వైభవంగా పూజలు

**ఆలయ అభివృద్ధికి భక్తుల .. విరాళాల వెల్లువ**

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 8** కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలిలో కొలువుదీరిన ప్రాచీన పుణ్యక్షేత్రం శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో కళకళలాడింది. స్వామివారి మేలుకొలుపు సేవ, సుప్రభాత సేవ, అలంకారోత్సవాలను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో వేదోక్తంగా విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి, అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సన్నిధిలో కొనసాగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

ఆలయ అభివృద్ధికి భక్తుల చేయూత

స్వామివారి దర్శనానికి వచ్చిన పలువురు భక్తులు ఆలయ అభివృద్ధి పనులకు తమవంతు సహకారాన్ని అందించారు. పెదతాడేపల్లి వాస్తవ్యులు కందిగిరి చంద్రశేఖర్--రత్నమాల దంపతులు రూ.2,501 విరాళాన్ని సమర్పించడంతోపాటు, స్వామివారి ఆలయ



అభివృద్ధి పనుల నిమిత్తం మరో రూ.2,501 అందించారు. దీంతో మొత్తం రూ.5,002 విరాళాన్ని సమర్పించారు.గుజరాత్‌కు చెందిన యర్రాప్రగడ అజయ్ మౌద్గల్య--బంగారు లక్ష్మి అనూష దంపతులు రూ.5,116 విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు స్వచ్ఛందంగా విరాళాలు అందించడం పట్ల ఆలయ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

విరాళాలు సమర్పించిన భక్తులను ఆలయ వేద పండితులు వెంకట అవధాని వేద ఆశీర్వచనాలతో ఆశీర్వదించారు. అనంతరం ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్త మండలి సభ్యులు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రంతో దాతలను సత్కరించారు.



# గౌతమీ తీరాన భక్తి సందడి.. వాడపల్లికి పోటెత్తిన భక్తులు



**స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు**

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 8:** కోనసీమ తిరుమలగా ఖ్యాతిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి పుణ్యక్షేత్రానికి శనివారం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో క్యూలైన్లలో బారులు తీరడంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వేకువజామున ప్రారంభమైన స్వామివారి దర్శనాలు రాత్రి 8 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగాయి.

వైభవంగా స్వామివారి మేలుకొలుపు సేవ

శనివారం వేకువజామున ఆలయ సన్నిధిలో స్వామివారికి మేలుకొలుపు సేవ నిర్వహించారు. అనంతరం ఐశ్వర్య లక్ష్మీ హోమం, అలంకారోత్సవం, సుప్రభాత సేవలను అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి తొలి హారతి సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనాలు, మంగళవాయిద్యాల నడుమ సాగిన సేవలు భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తాయి.

స్వామివారి దర్శనం కోసం వేకువజామునే ఆలయానికి చేరుకున్న భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా కనిపించాయి.

గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు

సుదూర ప్రాంతాల నుంచి వాడపల్లి క్షేత్రానికి వచ్చిన భక్తులు



తొలుత గౌతమీ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం మొక్కుబడుల్లో భాగంగా తలనీలాలు సమర్పించి, సంప్రదాయ దుస్తులు ధరించి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఏడువారాల నోము నోచుకునే భక్తులు ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ 'గోవిందా.. గోవిందా..' అంటూ భక్తిశ్రద్ధలతో నామస్మరణ చేయడంతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు

స్వామివారి దర్శనం అనంతరం భక్తులు ఆలయ సన్నిధిలో నిర్వహిస్తున్న అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

సాయంత్రం ఆలయ సన్నిధిలో నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఆలయ ఆధ్యాత్మిక వాతావరణానికి సాంస్కృతిక కార్యక్రమం మరింత శోభను తీసుకొచ్చింది.

భక్తులకు విస్తృత ఏర్పాట్లు


వేలాదిగా భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. దర్శన క్యూలైన్ల నిర్వహణతో పాటు భక్తులకు అవసరమైన



సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఏర్పాట్లు కొనసాగించారు.

ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధరరావు మాట్లాడుతూ.. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.శనివారం వాడపల్లి క్షేత్రానికి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగగా.. ఆధ్యాత్మిక శోభతో వాడపల్లి క్షేత్రం అలరించింది.






# పేదరిక నిర్మూలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

**-సి.వి.ఎ.పి కార్యాలయం ప్రారంభోత్సవములో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ.**


**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఆగస్టు 08**: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని పి-4 కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు.స్వర్ణాంధ్ర ఏ2047 లక్ష్య సాధనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ (సీవీఏపీ)లో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన సీవీఏపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా ప్రారంభించారు.సుమారు రూ.7 లక్షల వ్యయంతో మండల ప్రజా పరిషత్,సీవీఏపీ నిధులతో అసంపూర్తిగా ఉన్న స్త్రీ శక్తి భవనాన్ని పూర్తి చేసి అందులో ఏర్పాటు చేసిన సీవీఏపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు,నియోజవర్గ జనసేన సమన్వయకర్త మేడిశెట్టి బాబీతో కలిసి ప్రారంభించారు.సీవీఏపీ ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి,ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయనున్నట్లు పేర్కొన్నారు.పేదరిక నిర్మూలనకు పి-4 కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని,అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి వారి ఆర్థిక,సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని సత్యప్రభ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంవిఆర్ కుమార్ బాబు,మండల ఇంజనీరింగ్ అధికారి,ఎం సత్య ప్రకాష్,ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి,గంటిమళ్ల రాజ్యలక్ష్మి,గోళ్ళ క్రాంతి సుధాకర్,అన్నవరం ట్రస్ట్ బోర్డు మెంబెర్ పర్వత సురేష్,ధర్మవరం లింగంపర్తి,సొసైటీ అధ్యక్షులు దాసం శేషారావు,పెంటకోట మోహన్,కూటమి నాయకులు బద్ది రామారావు,అలమండ చలమయ్య,బస్సా ప్రసాద్,గొంతిన సురేష్,చక్కపల్లి నవీన్,యర్రాబత్తుల గోవిందనాయుడు,యువ నాయకులు అంబటి బుజ్జి,తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ చైతన్య జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 8:** ఫీజులు కట్టమని పదేపదే కాకినాడ రామారావు పేటకు చెందిన శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన యాజమాన్యం ఒత్తిడి తెస్తూ, అజయ్ అనే విద్యార్థి మరణానికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం జగ్గంపేటలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి డి యస్ యు విజృంభణ) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పి డి యస్ యు విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ మాట్లాడుతూ విద్యను వ్యాపారం చేస్తూ, ధనార్జనే ధ్యేయంగా నడుపుతున్న కాకినాడ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థి అజయ్ ఫీజుల విషయంలో యాజమాన్యం పెట్టే ఒత్తిళ్లకు తట్టుకోలేక నిన్న కాలేజీలో ఉరి వేసుకొని మరణం జరిగింది. ఈ మరణానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తూ యాజమాన్యపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్ టి యు ఉమ్మడి జిల్లా కార్యదర్శి కుంచె అంజిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.




# చిరతపూడి లో ఇంటింటికి తెలుగుదేశం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు 08:**తెలుగుదేశం అధికారం చేపట్టి అభివృద్ధి, సంక్షేమం నమ్మకంతో పరిపాలన చేస్తుందని ప్రజలకు వివరించారు. గ్రామ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని ప్రజలకు వివరించారు.
మండలం చిరుత పూడి గ్రామంలో డోర్ టు డోర్ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టి బజ్జి కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, క్లస్టర్ ఇంచార్జ్ గణపతి రాఘవులు, టిడిపి సీనియర్ నాయకులు నాగా బత్తుల వెంకట సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి రవణం రాము, కో క్లస్టర్ సరేళ్ళ వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ రంపం సత్యనారాయణ, కట్ట నాగమోహన్, వార శ్రీను బాబు, బొడ్డు రాంబాబు, కట్ట అబ్బులు, కట్ట రాంబాబు, బూత్ కన్వీనర్ నేతల రాము, పచ్చిపాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు దరఖాస్తు చేసుకోవాలి.




తహసీల్దార్ కుశరాజు.

**అలమూరు, పెన్ పవర్, ఆగస్టు 08;**ఓటర్ల జాబితాలో మీ పేరు, చిరునామా, ఇతర వివరాలలో తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి భారత ఎన్నికల సంఘం ఫారమ్ 8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించిందని తహసిల్దార్ కందుల కుశరాజు అన్నారు. ఈ మేరకు శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) భాగంగా ఓటర్లులందరికీ ఎన్యూమరేషన్ ఫారం లు పంపిణీ చేసి బిఎల్ఓ లు వెరిఫికేషన్ అనంతరం డ్రాఫ్ ఓటర్ లిస్ట్ సంబంధిత పోలింగ్ స్టేషన్లో ప్రచురణ ప్రతులు అందజేయడం జరిగిందన్నారు. వాటిపై అభ్యంతరాలు తెలియజేయ వచ్చునన్నారు. అలాగే మ్యాపింగ్ కానీ కేసులు, ఎనామిలిస్ ఓటర్లకు నోటీసులు పంపించడం జరుగుతుందన్నారు. బిఎల్ఓ లు వెరిఫికేషన్ అనంతరం తుది ఓటర్ లిస్టు ప్రచురించడం జరుగుతుందన్నారు. అయితే ముందుగా ఓటర్ల జాబితాలో మీ వివరాలు సరిగ్గా నమోదయ్యాయో లేదో తనిఖీ చేసుకోవాలన్నారు. జాబితా మీ పరిధిలోని బిఎల్ఓ దగ్గర అందుబాటులో ఉందన్నారు. తప్పుడు నమోదులు ఉన్నట్లు గుర్తించినట్లు యెడల వాటిని ఒప్పులుగా సరిదిద్దడానికి, మీ స్థానిక బూత్ లెవెల్ ఆఫీసర్ (బిఎల్ఓ) ద్వారా ఆఫ్‌లైన్‌లో గాని, నేరుగా గాని దరఖాస్తు చేయవచ్చు అన్నారు. అలాగే అధికారిక పోర్టల్(ఓటర్ హెల్ప్ లైన్ యాప్) ద్వారా ఆన్‌లైన్‌లో మార్పులు కోరవచ్చు అన్నారు. పేరు, వయస్సు, ఫోటో, అడ్రస్ తప్పులను మార్చడానికి ఫారం-8 నింపాలన్నారు. తప్పులను సరిదిద్దడానికి సరైన గుర్తింపు, జనన ధ్రువీకరణ పత్రాలు జత చేయాలన్నారు. ఫారం-6 తో కొత్త ఓటరు నమోదు చేసేందుకు గాను, ఫారం-7 తో జాబితాలో అనర్హులు, మృతుల పేర్ల తొలగింపులు కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫారాలతో పాటు అర్హత పత్రాలు జిరాక్సు తప్పనిసరిగా జత చేసి అందజేయాలన్నారు. అనుమానాల నివృత్తి కొరకు స్థానిక బిఎల్ఓ లను సంప్రదించాలని ఆయన సూచించారు.

# చట్టాలపై అవగాహనతోనే హక్కులను కాపాడుకోవచ్చు




ఏలూరు సుబ్రహ్మణ్యం

**కాజులూరు, పెన్ పవర్,ఆగస్టు 8:** ప్రజలందరూ చట్టాలపై అవగాహన పెంచుకుని, న్యాయ విజ్ఞానంతో మంచి జీవన విధానాన్ని కొనసాగించాలని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరు సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామంలో న్యాయవాది, బాలాజీ చారిటబుల్ ట్రస్ట్ అధినేత గునిపే బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.



ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని సీనియర్ న్యాయవాది బచ్చు రాజేష్ అన్నారు. చట్టపరమైన హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవడం ద్వారా అనేక సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. కాకినాడ మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్యానల్ న్యాయవాది యడ్ల కుటుంబరావు మాట్లాడుతూ, న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేని పేదలకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందన్నారు. ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారు కాకినాడ జిల్లా కోర్టు ఆవరణలోని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించి సేవలు పొందాలని సూచించారు. సొంత గ్రామ ప్రజలకు తన వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో బాలాజీ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గునిపే బాలాజీ,ఆయన సతీమణిని ప్రముఖులు సత్కరించారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలు, వృద్ధులకు నూతన వస్త్రాలను అందజేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాయుడు విజయ భాస్కర్ ప్రోత్సాహకాలను అందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగభూషణం,పులిదిండి శేఖర్, కవి మధునాపంతుల సత్యనారాయణ, వెంటపల్లి రమేష్,గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# అరవింద్ కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి



దూసర్లపూడి రమణరాజు

**కాకినాడ , పెన్ పవర్, ఆగస్టు 8:** విద్యా సంస్థల్లో అధిక ఫీజులు,విద్యార్థులపై వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్,సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చైతన్యలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అరవింద్ ఆత్మహత్య ఘటన విషాదకరమని,ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యా సంస్థల్లో రహస్య ఫిర్యాదుల పోర్టల్ ఏర్పాటు చేయాలని కోరారు.విద్యా సంస్థల్లో ఫీజుల భారం, విద్యార్థులపై వేధింపులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు కొన్ని సంస్థల్లో అధిక ఫీజుల వసూళు ,,ఒత్తిళ్లు కొనసాగుతున్నాయని ఆరోపించారు. కేవలం నోటీసు బోర్డులు ఏర్పాటు చేసి, అప్పుడప్పుడు ప్రకటనలు చేయడం కాకుండా తల్లిదండ్రులు,విద్యార్థులు తమ సమస్యలను గోప్యంగా తెలియజేసేలా ఆధునిక సాంకేతికతతో ప్రత్యేక రహస్య ఫిర్యాదుల పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.
అరవింద్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రమణరాజు కోరారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భద్రత,మానసిక ఆరోగ్యం, తల్లిదండ్రుల ఫిర్యాదుల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పటిష్టమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 8**: జగ్గంపేట నియోజకవర్గంలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఉద్దేశించిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రావులమ్మ నగర్ లోని క్యాంప్ ఆఫీసులో నిర్వహించారు. ప్రజా దర్బార్‌కు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను వినతి పత్రాల రూపంలో అందించారు. ముఖ్యంగా పెన్షన్ల మంజూరు, ఇళ్ల స్థలాల కేటాయింపు, హౌసింగ్ లోన్లు, డ్రైనేజ్, తాగునీటి సమస్యలు, రోడ్ల నిర్మాణం తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. రామవరం అంబేద్కర్ కాలనీ వద్ద చేపడుతున్న మెయిన్ రోడ్ నిర్మాణ పనుల్లో డ్రైన్ సౌకర్యం లేకపోవడంతో వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దళిత మహిళలు వినతి పత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన జ్యోతుల నెహ్రూ వెంటనే సంబంధిత అధికారులతో టెలిఫోన్‌లో మాట్లాడి రోడ్డు పనులతో పాటు డ్రైన్ నిర్మాణాన్ని కూడా చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అక్కడికక్కడే పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించారు. ఇతర సమస్యలకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి వివరాలు తీసుకుని, నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని సూచించారు. ప్రతి సమస్యను వ్యక్తిగతంగా పర్యవేక్షించి ప్రజలకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, తద్దితరులు పాల్గొన్నారు.

# పేకాట శిబిరంపై దాడి

ఒక లక్ష 52 వేల 200 నగదు , 12 ద్విచక్రవర్ణాలు స్వాధీనం



**పెన్ పవర్, ఆగస్టు 8**: గండేపల్లి మండలం ఎర్రంపాలెం గ్రామ శివారు తోటలో శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేసి ఒక లక్ష 52,000, రెండు వందల రూపాయలు, 12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు గండేపల్లి ఎస్ఐ శివ నాగ బాబు తెలియజేశారు. వారు వారు తెలిపిన కాకినాడ జిల్లా ఎస్ బిందు మాధవ్ ఐపీఎస్ వారి ఆదేశాలతో పెద్దాపురం డి.ఎస్.పి నేతృత్వంలో జగ్గంపేట సీఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడులలో రహస్యముగా పేకాట నిర్వహిస్తున్న రంగంపేట, పెద్దాపురం, సామర్లకోట, గండేపల్లి మండలాలకు చెందినవారు పేకాటలో ఉన్నట్లు గుర్తించినట్టు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టు తరలించడం జరిగిందని తెలిపారు.

## భావవరం ఏలేరు ప్రాజెక్టు విహారయాత్రలపై నిషేధం

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 8:** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం భావవరం గ్రామంలోని ఏలేరు ప్రాజెక్టు పరివాహక ప్రాంతాలలో విహారయాత్రలకు ఎటువంటి అనుమతులు లేవని, అక్కడ పర్యాటకుల సందర్శనను పూర్తిగా నిషేధించినట్లు జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు స్పష్టం చేశారు. శనివారం పోలీసులు ఈ ప్రాంతంలో నిషేధాన్ని తెలియజేస్తూ ప్రత్యేక హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రఘునాథరావు మాట్లాడుతూ సదరు పరివాహక ప్రాంతమంతా రిజర్వ్ ఫారెస్ట్ (అటవీ ప్రాంతం) పరిధిలోకి వస్తుందని, అందువల్ల లోపలికి ప్రవేశించేందుకు ఎవరికీ అనుమతి లేదని తేల్చి చెప్పారు. సుదూర ప్రాంతాల నుండి ఎవరూ కూడా ఇక్కడికి విహారయాత్రల కోసం రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. పోలీసుల ఉత్తర్వులను, నిబంధనలను అతిక్రమించి అక్రమంగా ప్రవేశించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్ట్ నీటి ప్రాంతాలలో లోతైన, ప్రమాదకరమైన పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయని ఎస్ఐ గుర్తుచేశారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ నీటిలోకి దిగితే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు, యువత తమ ప్రాణాలను ప్రమాదంలో పడేసుకోవద్దని, కావున దయచేసి ఎవరూ ఈ ప్రాంతాన్ని సందర్శించడానికి రావద్దని ఎస్ఐ రఘునాథ రావు కోరారు.



## ప్రభుత్వ ఆంధ్ర పాలిటెక్నిక్‌లో ఈ నెల 10న స్పాట్ అడ్మిషన్లు

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 8:** కాకినాడ ప్రభుత్వ ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిప్లొమా ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 10న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు వి. విజయ్‌కుమార్ తెలిపారు. పాలిసెట్-2026లో అర్హత సాధించిన అభ్యర్థులతో పాటు పాలిసెట్ పరీక్ష రాయకపోయినా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సోమవారం ఉదయం 11 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని, అనంతరం ఉదయం 11 గంటల నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు పాలిసెట్-2026 ర్యాంక్ కార్డు, హాల్‌టికెట్, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, పదో తరగతి మార్కుల జాబితా/పాస్ సర్టిఫికెట్, టీసీ, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులను రెండేసి సెట్లుగా సమర్పించాలి. కౌన్సెలింగ్ సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఫీజు ఓసీ/బీసీలకు రూ. 700, ఎస్సీ/ఎస్టీలకు రూ. 250గా నిర్ణయించారు. పాలిసెట్‌లో అర్హత సాధించని లేదా పరీక్ష రాయని విద్యార్థులకు ఓసీ/బీసీలకు రూ. 1,100, ఎస్సీ/ఎస్టీలకు రూ. 350 కౌన్సెలింగ్ ఫీజు ఉంటుంది. అన్ని కేటగిరీల విద్యార్థులకు కళాశాల ఫీజు రూ. 4,700గా నిర్ణయించినట్లు ప్రధానాచార్యులు తెలిపారు.

## బధిరుల ప్రత్యేక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 7:** బాపట్ల జిల్లా వేదులపల్లిలో బధిర విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపక, ఇతర పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సంచాలకులు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగానికి సంబంధించిన పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, అనుభవం, ఇతర ధ్రువీకరణ పత్రాల స్వీయ ధ్రువీకరించిన ప్రతులను జతచేసి ఈ నెల 20వ తేదీలోగా శాఖ వెబ్‌సైట్‌లో సమర్పించాలని సూచించారు. అర్హతలు, ఎంపిక విధానం, నిబంధనలు, షరతులు తదితర పూర్తి వివరాలను శాఖ వెబ్‌సైట్‌లో పరిశీలించాలని తెలిపారు. మరింత సమాచారం కోసం విజయవాడలోని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

వెబ్‌సైట్: https://wdcw.ap.gov.in

## ప్రతి ఇంటికీ సంక్షేమం: మాజీ జడ్పీటీసీ నులుకుర్తి



**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఆగస్టు 08:** రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 48 వ వార్డులో శనివారం కాకినాడ రూరల్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో మాజీమంత్రి ?చిక్కాల రామచంద్రరావు,? రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డా॥ చప్పిడి వెంకటేశ్వరరావులతో కలిసి వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల అభివృద్ధికి సైతం కృషి చేస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో మరింత సంక్షేమాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిల్ల కృష్ణ ప్రసాద్ (బుజ్జి) క్లస్టర్ ఇన్చార్జీలు కర్రీ వెంకటరాజు, పేరబత్తుల లోవబాబు, మీరపల ప్రకాష్, ఏఎంసీ చైర్మన్ మాసుమేను గంగయ్య నాయకులు దేవు వెంకటేశ్వరరావు, కొండా వినాయక్, కాళ్ల శ్రీను, సీతయ్య దొర, పెంకే గోవింద్, కొనాల కృష్ణ, చింతపల్లి సత్తిబాబు, తిరుమలరావు, వాసు,రామకృష్ణ, నాగరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 8** ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధి పనులు 30లక్షలు వ్యయంతో పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దల సమక్షంలో శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం తదితర సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గ్రామంలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమానికి యూనిట్ ఇంచార్జ్ కందుల రాంబాబు ఆధ్వర్యం వహించారు. గ్రామ ఉపాధ్యక్షులు షేక్ గౌస్, బూత్ ఇంచార్జిలు అత్తిలి చిరంజీవి, అత్తిలి వెంకటేశ్వరరావు, గుడేళ్ల నాగేంద్రగౌడ్, పల్లేటి నరసింహారావు, ఉలవల కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎన్డీఏ కూటమితోనే స్వర్ణాంధ్ర సాధ్యం: మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 8:** ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన ఇంటింటి ప్రచారంలో భాగంగా శనివారం రామచంద్రపురం పట్టణంలోని క్లస్టర్-2 పరిధిలోని 7వ వార్డులో మంత్రి పర్యటించారు. కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్న మంత్రి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వివరించారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తూ రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని, సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటోందని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి అతిపెద్ద బలమని, అదే స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి సుభాష్ అన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, క్లస్టర్-2 ఇన్‌చార్జి కంచుమర్తి బాబురావు, యూనిట్ ఇన్‌చార్జి ఉమ్మడి వెంకటరమణమూర్తి, 7వ వార్డు అధ్యక్షుడు టేకుమూడి శామ్యూల్, ఏఎంసీ డైరెక్టర్ నారపురెడ్డి బలరాం, రామకృష్ణ, తొగరు శ్రీను, మనోజ్, గౌరీశంకర్, కట్టా నాగేశ్వరరావు, కో-క్లస్టర్ ఏలూరు ఏసుదాసు, శనగల వెంకటేష్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా 'ప్రాజెక్ట్ హైవ్--2026'









**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 8:** ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ప్రాజెక్ట్ హైవ్--2026' డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్, డేటా సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు మాట్లాడుతూ,విద్యార్థులు చదువుతోపాటు ఇలాంటి ప్రాజెక్ట్ ఆధారిత కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా కమ్యూనికేషన్,టీమ్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవడానికి ప్రాజెక్టులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకినాడ జేఎన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఏఎస్ఎన్ చక్రవర్తి మాట్లాడుతూ, విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉన్నాయని అభినందించారు. గ్రూప్ ప్రాజెక్టులతో పాటు వ్యక్తిగత ప్రాజెక్టులను కూడా అభివృద్ధి చేయడం ద్వారా విద్యార్థుల సామర్థ్యం మరింత పెరుగుతుందని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఉత్తమ ప్రాజెక్టులను రూపొందించిన విజేతలను అభినందించి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన డేటా సైన్స్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డేటా సైన్స్ విభాగాధిపతి జి. విజయలక్ష్మి, ఏఐ డీన్ సిద్ధార్థరెడ్డి,ఐటీ మేనేజర్ కార్తీక్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## జనార్దనస్వామివారిని దర్శించి పులకించిన భక్త జనం





**ఆలమూరు, పెన్ పవర్,ఆగస్టు 08;** ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ప్రాత:కాలం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నాలుగు శనివారాలు, నాలుగు ప్రదక్షిణలు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్ప, తులసీ మాలలతో అలంకరించిన స్వామివారి రూపాన్ని తిలకించి భక్తజనం పులకించారు. ఒక భక్తురాలు మోకాళ్ళపై నాలుగు ప్రదక్షిణలు చేసి స్వామి పట్ల తనకున్న భక్తిని చాటారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవానాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## నషా ముక్త్ భారత్‌తో యువతకు ఉజ్వల భవిష్యత్తు.

బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఆగస్టు 08:**

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసి.. బాలికల రక్షణ,ఆరోగ్యం,విద్యకు ప్రాధాన్యం కల్పిస్తూ ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని టీనేజ్ గర్భధారణలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా పిలుపునిచ్చారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రత్తిపాడు లయన్స్ క్లబ్‌లో శనివారం ప్రత్తిపాడు,శంఖవరం సీడీపీఓలు టిడిఆర్ పద్మావతి,పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త మేడిశెట్టి బాబీతో కలిసి ఎమ్మెల్యే సత్యప్రభ పాల్గొన్నారు

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ వివరించారు. శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో కీలకమని,ప్రతి తల్లి బిడ్డకు తల్లిపాలు అందించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. తల్లులు, కుటుంబ సభ్యులకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై నిరంతరం చైతన్యం తీసుకురావాలని పేర్కొన్నారు. మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్ పథకం లబ్ధిదారులతో ఎమ్మెల్యే ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయం సక్రమంగా అందుతున్న తీరును,లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గ్రామాలను బాల్య వివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది,అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. బాలికలకు విద్యను అందించడమే కాకుండా,చిన్న వయసులో వివాహాల వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించాలని పేర్కొన్నారు. టీనేజ్ గర్భధారణలు లేని నియోజకవర్గంగా ప్రత్తిపాడును తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అవసరమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం తల్లిదండ్రులపై ఉందన్నారు. నషా ముక్త్ భారత్ లక్ష్యంతో యువతలో చైతన్యం తీసుకురావడంతో పాటు ఆత్మహత్యలు లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికల రక్షణ నుంచి శిశువుల ఆరోగ్యం వరకు,యువత భవిష్యత్తు నుంచి కుటుంబ సంక్షేమం వరకు ప్రతి అంశంలో సమష్టి కృషితోనే ఆరోగ్యకరమైన,సురక్షితమైన సమాజాన్ని నిర్మించగలమని ఎమ్మెల్యేవరుపుల సత్యప్రభ స్పష్టం చేశారు. ఏలేశ్వరం ఎంపీడీఓ రామరాజు వర్మ,రాచపల్లి,శాంతి ఆశ్రమం,పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఉషశ్రీ, రామ్‌కుమార్, యశస్వి కొండేపూడి ,న్యాయవాది అవసరాల దేవి కార్యక్రమం ప్రాముఖ్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్,ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి,గంటిమళ్ల రాజ్యలక్ష్మి,బద్ది రామారావు,నియోజవర్గ సిబిఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్,ధర్మవరం,లింగంపర్తి సొసైటీ అధ్యక్షులు దాసం శేషారావు,పెంటకోట మోహన్,బస్వా మహాలక్ష్మి ప్రసాద్,అంబటి బుజ్జి,వెలుగుల నాని,తటవర్తి సుబ్బారావు,యర్రాబత్తుల గోవిందునాయుడు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

